# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 2 హైదరాబాదు ఫిబ్రవరి, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 2 Hyderabad February, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



*BHAGAVAN SRI RAMANA MAHARSHI*



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
ఫిబ్రవరి 2024

**Sri Ramana Jyothi**
February 2024

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 115వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం** | శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి | 12 |
| **3.** | **శ్రీ రమణాశ్రమం ప్రెసిడెంట్‌గారు ఆనంద్ రమణన్ గారి ప్రసంగం** | | 17 |
| 4. | Acceptance will Lead to Contentment | Dr K Subrahmanian | 30 |
| 5. | Ashtavakra Gita 21 | V Krithivasan | 37 |
| 6. | Deepam Darshan | Sneha Choudhury | 40 |
| 7. | Animals at Sri Ramanasramam | | 41 |
| 8. | Bhagavan's Compassion | V Ganesan | 44 |
| 9. | Atma Vichara Padhigam | | 48 |
| 10. | The Son and the Father are the same | | 50 |

**Events in Sri Ramana Kendram in February 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 21st - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# మరణం, నిద్ర

డా॥ కే.యస్. గారి 115వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

మన కేంద్రంలో భక్తులు శ్రీ రాఘవేందర్ గారి తల్లిగారు దేహం చాలించారని తెలిసింది. రాఘవేందర్ గారికి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ మనఃస్థైర్యాన్ని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిద్దాం. గత కొన్ని ఏళ్ళ నుండి ఆవిడతో పరిచయం వుంది. ధైర్యశాలి, చెప్పుకోదగ్గ మహిళ. పిల్లల నందరిని చివరి దాకా, బాగా పైకి తీసుకొచ్చారు.

ఒకసారి జబ్బు చేసి కోలుకుంటున్న సమయంలో, మరెంత కాలం జీవించగలననే అభిప్రాయంతో ఆమె రాఘవేందర్ గారికి పదివేల రూపాయలు యిచ్చి ఏదైనా సత్కార్యానికి వాడవలసిందిగా నాకు యిమ్మన్నారు. ఈ అనుభవం మనం గుర్తించాల్సింది. ఫలానా కార్యానికి అని అనకుండా ఏదైనా నాకు తోచిన మంచిపనికి ఖర్చు చేయమని చెప్పారట. ఇది చాలా అరుదైన సంగతి. ఎప్పుడైనా సరే, ఇవ్వడంలో యిది ప్రత్యేకించి గొప్ప విషయం. ఆమె కోరిక చాలా సముచితమైనది కూడ.

ఒక పాఠశాల నిర్మాణంలో కొన్ని ఖర్చులకు ధనం అవసర ముందని ఒకరు నా దగ్గరకు వచ్చారు. అదే సమయంలో రాఘవేందర్ ధనం తెచ్చారు. ఏ ఆలస్యం లేకుండా ఆ డబ్బును పాఠశాల కోసం యివ్వడం జరిగింది. ఏ షరతులు లేకుండ ఏదైనా

యిచ్చినప్పుడు భగవంతుడు వెంటనే ఆ ధనాన్ని మంచి కార్యానికి ఖర్చుపెట్టేలాగ చూస్తాడు. మరొక విషయం ఏమిటంటే రాఘవేందర్ గారి తల్లి శ్రీకృష్ణుని భక్తురాలు.

అరుణాచలం గురించి, మహర్షి గురించి తెలుసుకున్నప్పటి నుండి ఆమె అరుణాచల శివ జపాన్ని చేయడం మొదలు పెట్టారట. రాఘవేందర్ గారు ఈ సంగతిని స్వయంగా చెప్పారు. ఏ దేవుని ఫొటో గాని ఆమె దగ్గర లేదని ఎవరో అన్నప్పుడు రాఘవేందర్ గారు రమణ మహర్షి ఫొటో యిస్తే, దానిని భక్తితో తమ కళ్ళు, శరీరానికి అద్దుకున్నారట.

## మాతృమూర్తి గొప్పదనం

ఎంత వయసు మీరినప్పటికీ తల్లి అంటే తల్లియే. ఎవ్వరమూ మన తల్లులకు తగినంతగా కృతజ్ఞతలు తెలుపుకోలేము. మనమే తల్లిదండ్రులయ్యే వరకు మన తల్లిదండ్రుల గొప్పతనాన్ని గ్రహించలేము. అందులోనూ ముఖ్యంగా మాతృమూర్తి విషయంలో అది ఎంతో నిజం. ఎవరికైనా దగ్గరయినప్పుడు, ఆ వ్యక్తిలోని తప్పులను ఎత్తిచూపే గుణం మనకుంటుంది. కాని దైవ కృప లభించినప్పుడు తప్పులు పట్టడం వుండదు. అలాంటివేవైనా వుంటే కూడ పట్టించుకోకుండ మనల్ని యిప్పటి స్థాయికి తెచ్చేందుకు తల్లిదండ్రులు చేసిన త్యాగాలను తప్పక గుర్తిస్తాం.

తల్లి, బిడ్డల కోసం పడే బాధ, తాపత్రయాలు నిజంగా అర్థం చేసుకోలేనివి. ప్రతిదినం పిల్లల గురించి ఆలోచిస్తూనే వుంటారు.

ఈ విషయంలో వాళ్ళకు తృప్తి అంటూ వుండదు. మీరు బయటికి వెళ్ళి, తిరిగి రావడం ఆలస్యమైతే మీ తల్లికి నిద్ర పట్టదు. మీరు తినకపోతే బాధపడుతుంది. చాలామంది తల్లులు తమ పిల్లలు తిరిగి వచ్చేదాకా తాము తినరు. అందుకే దేవీనామావళి లలితా సహస్రనామాలలో, 'ఓం శ్రీ మాతా, శ్రీ మహారాజ్ఞీ' అంటాము. దేవి మన తల్లి. అందుకే మొదటి పదం శ్రీమాత. ముఖ్యమైనది మొదటి నామం.

మాతృమూర్తి మనల్ని పోషిస్తుంది. ఆదిశంకరులు 'మాతా చ పార్వతీ దేవీ, పితా దేవో మహేశ్వరః బాంధవాశ్శివ భక్తాశ్చ, స్వదేశో భువనత్రయం' అన్నారు. అంటే అర్థం నా తల్లి పార్వతి, తండ్రి మహేశ్వరుడు, శివభక్తులందరూ నా బంధువులు. నేను ఈ విశ్వానికి చెందిన వాడిని మాత్రమే కాను, స్వర్గం, నరకం, భూమి, అన్నింటికీ చెందిన వాడిని అని. అందుకే తల్లి ప్రేమ అసాధారణమైనది.

ఇలాంటి సందర్భంలో మనం మృతి చెందడం నిశ్చయమని గ్రహిస్తాము. దుఃఖంలో వున్న సమయంలో దేవుడు మాత్రమే మనకు శాంతిని ఇవ్వగలడు. మిగతా అన్నింటి గురించి ఖచ్చితంగా చెప్పలేము. జీవితంలో అనేకం జరుగుతూ పోవచ్చు. ఆస్తి, అధికారం, హోదా ఏవైనా సరే మనం ఈ లోకాన్ని వదలివెళ్ళడం ఖాయం. వచ్చేటప్పుడు మనం ఏమీ తేలేదు. ఏమీ తీసుకోకుండా వెళ్ళిపోతాం. కాని యీ నడిమికాలంలో ఎంత హడావుడి చేస్తాం! నేను గొప్పయని, ఇదనీ, అదనీ చెప్పుకుంటాం. ఎంత పెద్ద డాక్టర్లైనా సరే, ప్రపంచం వదలి వెళ్ళాల్సిన క్షణంలో ఏమీ చేయలేరు.

## అన్నిటికంటే ఆశ్చర్యం

మహాభారతంలో ఒక యక్షుడు ధర్మరాజును ‘‘యీ ప్రపంచంలో అతి అద్భుతమైన విషయం ఏమిటి?’’ అని ప్రశ్నించారు. జవాబుగా ధర్మరాజు ‘‘అహన్యహాని భూతాని గచ్ఛయంతి యమాలయం, శేషాస్తవిరమిచ్ఛంతి, కిమాశ్చర్య తతః పరమ్. ప్రతి రోజూ మానవుడు ఎన్నో జంతువులు, పక్షులు, ప్రజలు చనిపోవడం చూస్తూనే వుంటాడు. కాని తాను మాత్రం చాలా కాలం జీవించి వుంటాననీ, కొందరు తాము అసలు చనిపోమనీ భావిస్తుంటారు. ఇదే అత్యంత అద్భుతమైనది’’ అన్నాడు. మర్త్యులు ఏదో ఒక రోజు మరణించాల్సిందే.

అసలు మరణమంటే ఏమిటి? మరణం అంటే శరీరం లేకపోవడం, శరీరం రాలిపోవడం. అది జరిగాక ఆ శరీరం యిక పనికి రానిదంటారు. స్పృహ వున్నప్పుడు, మరణం లేదంటారు. కాని అదే సమయంలో ప్రతిరోజూ మనకు శరీర స్పృహ కనీసం కొన్ని గంటల పాటు వుండదు. అయినప్పటికీ, మనం చనిపోము. గాఢనిద్రలో మన పేరు, ప్రఖ్యాతి, శరీరం, ఆస్తులు ఈ ప్రపంచపు స్పృహ, ఏదీ వుండదు. అయినప్పటికీ సంతోషంగా వుంటాం. ఆ ఆరు లేదా ఎనిమిది గంటల సమయం తరువాత మళ్ళీ సాధారణ జీవితంలోకి వస్తాం. అదే, మరణంలో అలాంటిది జరగదు. మరణంలో గాని, నిద్రలో గాని మీ గురించిన స్పృహ మీకు వుండదు. అందుకే నిద్ర అంటే తాత్కాలిక మరణం.

మరణం అంటే శాశ్వత నిద్ర. గాఢ నిద్రలో శరీర స్పృహ వుండదు, కాని సుఖంగా వుంటాం. మీ మనసు ఆ సమయంలో వుండదు. నిద్ర నుండి లేచినప్పుడు మళ్ళీ మనసు ప్రత్యక్షమౌతుంది. దానితో బాటే సమస్యలూ గుర్తుకొస్తాయి. మీరు గొప్ప వ్యక్తులనే ధ్యాస కూడ వస్తుంది. అది అహం వల్ల కలుగుతుంది. గాఢ నిద్రలో అహం వుండదు. అందరం నిద్రను కోరుకుంటాం. శరీరానికి విశ్రాంతి కోసమని కాదు. మనసుకు విశ్రాంతి కోసం. రోజంతా కలతలతో, అది కావాలి, ఇది కావాలి, అది చేయాలి, ఇది చేయాలి అన్న తపనతో, విసిగిపోయి అలసి అలాగ నిద్రను కోరుకుంటాం. అలాంటి విశ్రాంతి కలలు లేని నిద్రలో లభిస్తుంది. లేకపోతే పడక మీద ఆరు, ఏడు గంటలు అటూ, ఇటూ, దొర్లుతున్నప్పటికీ మనకు విశ్రాంతి లభించదు.

మనసు చురుకుగా పనిచేయక పోయినప్పుడు విశ్రాంతి దొరుకుతుంది. అంటే, మనసు పనిచేయనప్పుడు, మనసు ప్రశాంతంగా వున్నప్పుడు, నిద్ర నుండి లభించే శాంతి లాగే అప్పుడూ శాంతి లభిస్తుందన్న మాట. ప్రార్థన, పూజ, జపం, ధ్యానం చేయడం యొక్క ముఖ్యమైన ఉద్దేశం అదే. వాటి వల్ల కాని, నామ సంకీర్తన వినడం వల్ల గాని కనీసం కొంతసేపైనా, శాంతి లభిస్తుంది. అది గాఢ నిద్ర వల్ల లభించే శాంతితో దాదాపు సమానంగా వుంటుంది. పూజ, జపం, ధ్యానం చేయడంతో భగవంతుడు మనకు అలాంటి శాంతినే కల్పిస్తాడు.

## అందరి పట్ల సుహృద్భావన

వయసు పెరిగే కొద్దీ, ధ్యానం, పూజ లాంటివి మరింతగా చేయడంతో మనశ్శాంతి కూడా ఎక్కువగా లభిస్తుంది. ఇతరులను ప్రశాంతంగా వుంచడంలో సహాయపడితే మనకూ శాంతి లభిస్తుందని తెలియవస్తుంది. ఎదుటివారు స్నేహపూర్వకంగా వుండాలంటే మనం కూడ వారి పట్ల అదే భావనతో వుండాలి. సంతోషంగా లేని వ్యక్తి యితరులను సంతోషపెట్టలేడు. దుఃఖంలో వున్న వారిని చూస్తే మనకు బాధ, దుఃఖం కలుగుతాయి. అలాగే ప్రశాంతంగా వున్న వారిని దర్శించినప్పుడు, మనకూ శాంతి లభిస్తుంది. ఆ కారణంగానే మనం సాధువులు, గురువులను దర్శించుకునేందుకు ఆసక్తిని చూపుతాం.

ధన, వస్తు సేకరణల పై వున్న ఆశ, ఆసక్తికి అంతు వుండదు. మన పరిసరాల్లో, జీవనానికి అత్యవసరం అయిన వాటిని సంపాదించుకునేందుకు కూడ అవకాశం లేని వారిని గమనిస్తూనే వుంటాం. దురాశ అన్నది, మనకు సరిపడ వున్నప్పటికీ మరింతగా సేకరించాలని రెచ్చగొడుతుంది. మరొక అసాధారణ విషయ మేమిటంటే, ధనవంతులు కూడ, సాధు, సన్యాసులను కలిసి, మనశ్శాంతి నివ్వమని కోరుకుంటారు.

ఈ సన్యాసులు ఎవరు? లౌకికంగా ఏమీ లేనివారు. ఏమీ లేని వారి దగ్గరికి యిలాగ అన్నీ వున్నవారు వెళ్ళడం ఒక విధంగా ఆశ్చర్యంగానే వుంటుంది. కాని వారు మనకు అవసరమైనది ఏదో

యిస్తారు. అదే మనశ్శాంతి. వారు మన నుండి ఏమీ కోరరు. వారి సమక్షంలో కూర్చుంటే చాలు, ఏమీ చెప్పకపోయినప్పటికీ మనకు అవసరమైన ప్రశాంతతను మౌనంగానే ప్రసాదించగలరు. వారిని దర్శించుకున్న వారు ఏ ఫలమో సమర్పించుకున్నప్పటికీ అందులో మళ్ళీ కొంత తీసి అందరికీ తమ ప్రసాదంగా యిస్తారు. ఏ కోరికలూ లేని వాళ్ళు ఈ విశ్వానికి మూలాధారమైన ఆ దేవుని అన్వేషణనే ప్రధాన కర్తవ్యంగా చేసుకుంటారు. అత్యున్నతమైన, శ్రేష్ఠమైన దానినే కోరుకుంటారు. ఆ భగవంతుడొక్కడే మనకు అవసరమైన అసాధారణ శాంతి ప్రసాదించ గలడు. అంతా, ఆయన యిచ్ఛగా అంగీకరించి సంపూర్ణ శరణాగతి చెందాలి.

### కర్తవ్య నిర్వహణ

ఇక మన కర్తవ్య నిర్వహణ గురించి చెప్పుకోవాలంటే, చేయవలసిన పనిని శక్తివంచన లేకుండ చేయాలి. ఫలితం ఏదైనప్పటికి, భగవదేచ్ఛగా భావించాలి. మనకు ఏది నిజంగా అవసరమో మనకే తెలుసు. కాని దురాశ వల్ల హద్దు లేకుండ మరింతగా ఆర్జించాలని తలిస్తే ఏర్పడే సమస్యలు కూడ మన ఎఱుకలోకి వస్తాయి. భగవంతునిపై పూర్ణ విశ్వాసంతో వుంటే ఆయనే మనలో సంతృప్తి భావనను కలిగిస్తాడు. అప్పుడు ఎలాంటి భయమూ, ఒత్తిడి వుండవు. ఆ భావనతో మన పని చేసుకున్నప్పుడు అంతరంగం ప్రశాంతతతో నిండి పోతుంది. మనం మానవ మాత్రుల మేనని, మన పరిమితులు, ప్రేరేపణలు అవరోధాలని తెలుసు

కుంటే, అప్పుడు ఏర్పడే నమ్రత ద్వారా, భగవదృపతో జీవితం శాంతియుతంగా సాగుతుంది. అలాంటి వారు తాము తమంతటి ముఖ్యులు కారని, స్వతహాగా తాము ఏ పని చేయలేమని, భగవంతుని చేతిలో పనిముట్టు మాత్రమేనని గ్రహించుతారు.

పిల్లనగ్రోవిని ఒక ఉదాహరణగా తీసుకోండి. అది చూడడానికి డొల్లగా వుండి, లోపల ఏమీ వుండదు. పైన కొన్ని రంధ్రాలు మాత్రం వుంటాయి. కాని దానిని వాయిస్తే అందులో నుండి సంగీతం పుట్టుకు వస్తుంది. అలాగే మన మనసు ఖాళీగా వుండి, నేను, నాది, అనే భావనలు లేకుంటే, అహం పూర్తిగా నశిస్తే, దేవుడు మనల్ని ఒక వేణువులాగ మలుస్తాడు. మన బల్ల సొరుగు అన్ని వస్తువులతో నిండి వుంటే, దానిని వాడలేము కదా!

అంటే మనసును ఖాళీగా వుంచుకోవాలి. అంటే మమకారం, అహంకారం, ఇవన్నీ నావి అనే భావన లేకుండా, అన్నీ ఆయన నుండి వచ్చినవేననీ, తిరిగి ఆయనకే చేరుతాయని నమ్మాలి. మరణం అందరికీ సంభవించి తీరుతుంది. కాని మనం బ్రతికి వున్నప్పుడు అహాన్ని చంపుకోవడమే ప్రధాన కర్తవ్యంగా పెట్టు కోవాలి. మన ప్రయత్న ఫలితాలు ఏ తీరుగా వచ్చినప్పటికీ, భగవదేచ్ఛ అనుకోవాలి కాని, ఫలవంతం కాలేదని దేవుడిని తప్పు పట్టకుండ, మన పనులు మనం చేస్తూ పోవాలి.

వ్యక్తులు కర్తవ్య నిర్వహణలో, తాము కేవలం భగవంతుని చేతిలో పనిముట్టు మాత్రమే అనే భావనతో పనిచేస్తే, బ్రహ్మాండంగా

పని చేస్తారు. కాని అందులో తాము విజయవంతులు కొన్ని సమయాల్లో కాకపోయినప్పటికీ, అలా జరగడం భగవదేచ్ఛ అని గ్రహిస్తారు. అందుకని ఆ క్షణంలో ఏ బాధాపడరు. ఫలితాలు భగవంతుని చేతిలో వున్నాయని తెలుసుకుంటారు.

డాక్టరు యొక్క విధి రోగి గాయానికి కట్టు కట్టడము మాత్రమే. కాని నయం చేయడమన్నది దేవుని చేతిలో వున్నదని వైద్యుడు గుర్తించాలని శ్రీ రామకృష్ణ అంటుండేవారు. అలా కాకుంటే తాను వైద్యం చేసిన వారందరూ బ్రతికి వుండాలి. మనం కోలుకునేందుకు ఆ కట్టు, లేదా ఏ మందులు కూడ కారణం కాదు. ఇది ఏమిటని ఆశ్చర్యపోవచ్చు గాని, ప్రభువు అలాగ నిర్ణయించాడని గ్రహించాలి. ఆ భావన బలమయ్యే కొద్దీ, భగవంతునికి మనల్ని అర్పించుకునే కొద్దీ మన అహం తగ్గుతుంది. మన ఆనందం ఎక్కువవుతుంది. అహంకార, మమకారాలు తగ్గే కొద్దీ శాంతి ఏర్పడుతుంది.

భగవంతునిలో లీనమైన ఆ మాతృమూర్తికి శాంతిని ప్రసాదించమని మనమందరమూ ప్రార్థిద్దాం.

*****

# శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం

శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి

(భగవాన్ శ్రీ రమణులతో మరియు శ్రీ రమణాశ్రమంతో మా గ్రిద్దలూరి వారి కుటుంబం 102 సంవత్సరాలకు పైగా చాలా సన్నిహిత సంబంధం కలిగి వున్నది. తరతరాలుగా భగవాన్ మా కుటుంబ సభ్యులను ఎలా కృపతో ఆశీర్వదిస్తూ, కాపాడుతూ వున్నారో శ్రీ బి. రవికృష్ణశర్మగారితో పంచుకున్నారు. మా నాన్నగారి మాటలలో... - జి.వి. ప్రభాకర కుమార్)

**జయ శ్రీ రమణ జయ శ్రీ రమణ జయ శ్రీ రమణ జయ రమణ**

''స్మరణమాత్రముననె పరముక్తి ఫలద, కరుణామృత జలధి యరుణాచలమిది'' .. అటువంటి అరుణాచలం పుణ్యక్షేత్రంలో అడుగు పెట్టాలన్నా, అక్కడి ఆది దంపతుల దర్శనం చేసుకోవాలన్నా పూర్వ జన్మ సుకృతం ఉండాలంటారు. అంతటి ''అదృష్టము, మహా భాగ్యము గ్రిద్దలూరి వంశానికి 102 సంవత్సరముల క్రితం (1922లో) శ్రీ ప్రణవానందుల ద్వారా శ్రీ గ్రిద్దలూరి సత్యనారాయణ రావు (మా నాన్న) గారికి కలిగింది. అందుకే కృత్తికా దీపోత్సవం అయిన మరుసటి రోజు (కార్తీక బహుళ పాడ్యమి) గ్రిద్దలూరి వారికి ఎంతో సుదినం. యావత్తు గ్రిద్దలూరి కుటుంబం అరుణాచలానికి ఇప్పుడు అలవోకగా వెళ్ళి వస్తున్నారు. ఈ సందర్భంలో శ్రీ ప్రణవానందులవారికి - శిరసా, వచసా, మనః పూర్వక పాదాభివందనం''.

**శ్రీ భగవానుల యొక్క మొదటి దర్శనం, గ్రిద్దలూరి కుటుంబంలో వారి ప్రవేశం:** మా నాన్నగారి పేరు గ్రిద్దలూరి సత్యనారాయణరావు

మరియు మా అమ్మగారి పేరు వెంకట సుబ్బమ్మ. మా నాన్నగారు రాయ వెల్లూరులో మహంతు పాఠశాలలో టీచరుగా పని చేస్తున్నప్పుడు, 1922 నవంబర్‌లో శ్రీ ప్రణవానందులు (వీరే శ్రీ సర్వేపల్లి నరసింహయ్య గారు. వీరు స్వతంత్ర భారతదేశ ద్వితీయ రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పినతండ్రి) మా నాన్నగారితో 'సత్యనారాయణరావు, అరుణాచలంలో కృత్తికా దీపోత్సవం జరుగుతున్నది. అక్కడికి పోదాం. అక్కడ బ్రాహ్మణస్వామి అని వున్నారు. వారి దర్శనం చేయిస్తాను' అని చెప్పి అక్కడకు మా నాన్నగారిని తీసుకొని వెళ్ళారు. కృత్తికా దీపోత్సవం అయిన తరువాతి రోజున భగవాన్ దర్శనానికి వెళ్ళారు. ఇప్పుడెక్కడైతే భగవాన్ సమాధి వున్నదో అక్కడొక పెద్ద బండరాయి వుండేది. భగవాన్ దానిమీద కూర్చొని వున్నారు. నాన్నగారు మొదటి దర్శనంలోనే సంపూర్ణ శరణాగతి చెందారు. మా నాన్నగారికి అప్పుడు 24 సంవత్సరాలు. అప్పటి నుండి ప్రతీ శని, ఆదివారాలు రమణాశ్రమానికి వెళ్ళేవారు. మా నాన్నగారు ట్రైన్ దిగి రమణాశ్రమంకి చేరుకున్నప్పుడు, ఆ సమయంలో గోశాల నుండి వస్తున్న భగవాన్, నారాయణరావు వచ్చాడని విని, నాన్నగారి భుజాలమీద చేతులు వేసి ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయేవారు. వాళ్ళు ఏమి మాట్లాడుకునేవారో ఇంట్లో చెప్పేవారు కాదు. మా చిన్నాయన గ్రిద్దలూరి లక్ష్మీనరసింహారావు గారు వాళ్ళిద్దరిని గురించి: 'ఆ సాయంత్రం వేళ వాళ్ళిద్దరూ అలా నడుచుకుంటూ వెళుతున్నప్పుడు భగవాన్ మీద సూర్యకిరణాలు పడుతూ ఉంటే, భగవాన్ శరీరం దబ్బపండు మాదిరి నిగనిగ లాడుతూ మెరుస్తూ వుండేది. దానికి పూర్తి వ్యతిరేకమైన నల్లని శరీరం మా అన్నయ్యది' అని చెప్పేవారు.

**సత్యనారాయణ రావు గారి కుటుంబం:** 1924లో మా పెద్దక్క రుక్మిణి పుట్టింది. 1930లో రెండవ అక్క పుట్టింది. మా రెండవ అక్క పేరు సరస్వతి. మా చిన్నాయన భార్య పేరు కూడా సరస్వతి. అలా పిలవటం ఇబ్బందిగా ఉన్నదంటే ''బాల సరస్వతి'' అని పిలవమన్నారు భగవాన్. 1936లో నేను పుట్టాను. నాకు ముందు ఇంకొకరు పుట్టారు. అతనికి అరుణాచలం అని పేరు పెట్టారు. కాని తను శరీరం చాలించటంతో నాకు ఏ పేరు పెట్టాలి అని అనుకుంటూ వుంటే భగవాన్ విని ''కృష్ణమూర్తి'' అని పేరు పెట్టమన్నారు. ఆ తరువాత మా చెల్లెలు పుట్టింది. ఆమెకు కూడా భగవానే 'వరలక్ష్మి' అని పేరుపెట్టారు. నెల్లూరు జిల్లాలో ఇప్పుడున్న రమణ భక్తులంతా మా నాన్నగారి ద్వారానే భగవాన్ మార్గంలోకి వచ్చారు. మొదట్లో భగవాన్ దగ్గర తమిళుల కంటే ఎక్కువగా తెలుగు భక్తులే వుండేవారు.

**భగవాన్ సన్నిధిలో నాన్నగారి అంత్య దశ:** 1939లో మా నాన్నగారికి గొంతులో క్యాన్సర్ వచ్చింది. రాయవెల్లూరులో డాక్టర్లు 6 నెలలు మాత్రమే బ్రతికే అవకాశం వున్నది, ఎక్కువ కాలం బ్రతకరు అని అంటే మా నాన్నగారు వారి పెద్ద అన్నయ్య సాంబశివరావు గారితో 'అన్నయ్యా నా చివరి కాలం నేను భగవాన్ దగ్గర వుండాలని అనుకుంటున్నాను' అని అనటంతో ఆశ్రమం అధికారులను అడిగితే ఆశ్రమంలో ఉండటానికి అనుమతించారు. అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేవని, మామూలుగానైతే అనుమతినివ్వరు. ఇప్పుడు ఎక్కడైతే కిచెన్ హాలు ఉన్నదో, దానికి ఎదురుగా స్టోరు రూములో మా నాన్నగారికి మంచం ఏర్పాటు చేశారు. భగవాన్ రోజూ వచ్చి తాకి ''సత్యనారాయణ రావ్, ఎలా వున్నావు'' అని అడిగేవారు. అలా ప్రతీ రోజూ జరుగుతూ ఉండేది. ఒకరోజు

నాన్నగారి నాలుక బయటకు వచ్చింది. మా పెద్దక్క భగవాన్‌ను తాత అని పిలిచేది. భగవాన్ ఒక గొప్ప మహాత్ములని అప్పుడు తెలియదు మా అక్కకు. అందుకని భగవాన్ దగ్గరకు వెళ్లి తాత, నాన్నకు బాగోలేదు అని చెప్పి చేతులు పట్టి లాక్కొని వచ్చింది. అప్పుడు భగవాన్ వచ్చి, ఆముదం తెమ్మనమని చెప్పి, భగవాన్ కుడి తొడమీద నాన్నగారి తల పెట్టి శరీరమంతా ఆముదముతో మర్దన చేశారు. అప్పుడు నాలుక లోపలికి పోయింది. అది అయిపోయిన తరువాత భగవాన్ దగ్గర వుండే సేవకులు సబ్బు, నీళ్ళు, తువ్వాలు తీసుకొని వస్తే భగవాన్ అవేమీ వద్దని చేతులను తన వంటి మీద రుద్దుకొని అక్కడినుండి వెళ్లిపోయారు. నోటి క్యాన్సర్ కావటంతో ఏ పదార్థమూ మ్రింగుడుపడేది కాదు. దాంతో మళ్ళీ మా అక్క భగవాన్‌ను పట్టుకొని వచ్చింది. అప్పుడు భగవాన్ ఒక్క 15 నిమిషాలు మా నాన్నగారి గొంతువైపు చూసి వెళ్లిపోయారు. ఏవైతే గొంతులో ఆహార పదార్థాలకు అడ్డంకిగా వున్నాయో, ఆ కండలన్నీ వాంతి రూపంలో బయటకు వచ్చేశాయి. దానితో ఆహార పదార్థాలు మ్రింగుడు పడ్డాయి.

"చూచి చింతించి మేనున్ తాకి....."

ఇటువంటి సర్జరీని ఏమని చెప్పాలి? ఏ డాక్టర్లయినా చేయగలరా ఇటువంటి సర్జరీని? మా నాన్నగారికి భగవాన్ చేతి స్పర్శ కలిగింది. ఆశ్రమంలో రాత్రిపూట స్త్రీలు వుండకూడదు కాబట్టి మా పెద్దనాయన గారి కొడుకు, నాకు అన్నయ్య అయిన వెంకట రమణ గారు రాత్రి పూట మా నాన్నకు సేవ చేస్తూ వుండేవారు. భగవాన్ మధ్య మధ్యలో మా అన్నయ్యను పిలిచి వెంకట రమణ, సత్యనారాయణ రావు ఎలా వున్నారు? అని అడిగేవారు.

1939 ఫిబ్రవరిలో మా నాన్నగారు శరీరాన్ని వదిలివేశారు. శరీరాన్ని వదిలివేసే చివరి క్షణాలలో భగవాన్ వచ్చి మా నాన్నగారి మీద కాసేపు చేతులుంచి వెళ్లిపోతుంటే, నా పిల్లల సంగతీ అని మా నాన్నగారు అంటే, అప్పుడు భగవాన్ సాంబశివరావు గారిని పిలిచి సత్యనారాయణరావు పిల్లల గురించి ఏమి ఆలోచించావు? అని అడిగితే మా పెద్దనాయన గారు 'నేను బ్రతికున్నంతవరకూ ఆ పిల్లల బాధ్యత నాది' అని భగవాన్‌తో చెప్పారు.

**శ్రీ భగవాన్‌తో అమ్మ (వెంకట సుబ్బు):** మా నాన్నగారు కాలం చేసిన మూడవ రోజున, మా అమ్మగారు చీకాకు చెంది పిల్లలను పాలితీర్థంలో వేసి, నేను కూడా చనిపోతాను అని వారణాసి సుబ్బలక్ష్మమ్మ గారితో చెప్పింది. వెంటనే ఆవిడ పోయి భగవానుకు చెప్పింది ఆ మాటను. భగవాన్ అప్పుడు, "ఆమె కెందుకు చింత? నేను లేనా, సాంబశివరావు లేడా" అని అన్నారు. అలా భగవాన్ మా కుటుంబానికి అభయాన్ని ఇచ్చారు. మా నాన్న గారికి భగవాన్ మీద ఉన్న నిగూఢమైన భక్తియే దీనికంతటికీ కారణం.

మేము నెల్లూరులో చిన్నపిల్లలుగా వున్నప్పుడు సుందరము, గణేశన్, మణి, ఆడపిల్లలు మా ఇంట్లో ఏవైనా వేడుకలు కాని, పెళ్ళిళ్ళు కాని జరిగితే అందరూ వచ్చేవారు. అప్పుడు మేము గణేశన్‌తో, సుందరంతో ఆడుకొనే వాళ్ళము. పిచ్చు అయ్యరు గారు, అలమేలు అత్త వాళ్ళు కూడా వచ్చేవాళ్ళు. ఇంకొకటేమిటంటే, సుందరం గారికి పుట్టు వెంట్రుకలు తీయించటానికి తిరుపతి వెళుతూ రాయవెల్లూరులో మా యింటికి వచ్చారు. అప్పుడు రాత్రి 12 గంటలు కావస్తూ ఉన్నదట. అప్పుడు మా అమ్మగారు కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళను ఇచ్చి, వేడి వేడిగా అన్నమూ, సాంబారు వండి వడ్డించింది. *(సశేషం)*

## శ్రీ రమణాశ్రమం ప్రెసిడెంట్ గారు ఆనంద్ రమణన్ గారి ప్రసంగం

అంతకు పూర్వం మహాత్మాగాంధీ రచనల సంపాదకుడు, గొప్ప రమణ భక్తులైన ప్రొ॥ స్వామినాథన్ యిలా అన్నారు: "ఈ యిద్దరు ఆధ్యాత్మిక ఘనులు ఒకరినొకరు ఎదురుగా కలుసుకోకుండ వుండాలని దైవిక శక్తి జాతీయ స్వాతంత్ర్య సాధనకు తోడ్పడే విధంగా నిశ్చయించింది". రమణ మహర్షి ఆధ్యాత్మిక భానుడైతే, గాంధీజీ ప్రజలకు శాంతి ప్రసాదిస్తున్న చల్లని చంద్రుడు. సూర్యుని సమక్షంలో చంద్రుడు కరిగిపోతాడన్న భావనతో వారు విడివిడిగా వుంచబడ్డారు.

మహాత్మా గాంధీ "యిడ్లీ"ని చూసినప్పుడల్లా రమణాశ్రమంలో యిడ్లీని గుర్తు చేసుకొనడం మరచేవారు కాదు. మహర్షిని, ఆయన ఆశయాలను స్మరణ చేసుకొనడం ఆయన అలవాటు.

స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఖాదీ గుడ్డతో జాగ్రత్తగా జాతీయ పతాకం భగవాన్ దానిపై గీసిన అశోకచక్రంతో సహా తయారయ్యేది. ఆగష్టు 15, 1947న భగవాన్ పర్యవేక్షణ క్రింద జాతీయ పతాకం ఎగురవేయబడింది. ఆ సంప్రదాయం యిప్పటికీ కొనసాగుతోంది. భారతీయ ఆధ్యాత్మిక పారంపర్యతను కాపాడి, జీవం పోస్తున్న ఎందరో ఆధ్యాత్మిక నాయకులను భగవాన్ ఆశీర్వదించారు.

భగవాన్‌తో తమ సమావేశాన్ని గురించి స్వామి చిన్మయానంద యిలా చెప్పారు. "నేను కాలేజీలో చదువుకున్న రోజుల తరువాత ఉత్తరకాశీలో నా గురువు తపోవన్ పాదాల దగ్గర, గంగానది ఒడ్డున నేను సంపాదించిన జ్ఞానం, ఏళ్ళకు ముందు తిరువణ్ణామలై యోగి

సమక్షంలో, ఆ తీక్షణ వేసవిలో, కేవలం ఆయన దృక్కులతో ప్రసాదింపబడినదే అని నాకు తెలిసి వచ్చింది. ఆయన గురువు స్వామి తపోవన్ మహారాజ్, తమ కౌమార దశలో భగవాన్‌ను దర్శించుకునే భాగ్యాన్ని పొందారు. స్వామి తపోవన్ మాటల్లో: మహర్షి శాంతి, మౌనముల విగ్రహరూపం. ఆయనను ఆరాధించే అందరూ ఆ దైవిక మౌనాన్ని తప్పక ఆస్వాదించాలి. ఆ మౌనం "నేను ఎవరు" అన్న అన్వేషణ తప్ప మరేమీ కాదు. లౌకిక ప్రపంచంలోని అన్ని కార్యక్రమాలను నిర్వర్తిస్తూ కూడా దీనిని సాధించ వచ్చు.

రామకృష్ణ మఠానికి చెందిన స్వామి రాజేశ్వరానంద "రమణ మహర్షి బోధ మానవాళి తరతరాలకు చేరవేయవలసిన దైవిక పారంపర్యత". అన్ని దేశాలు, జాతులు, తెగలను, మొత్తం ప్రపంచాన్ని ఏకైక ఆత్మ దిశలోకి అది చేరుస్తుంది" అన్నారు.

మహర్షి దివ్య సన్నిధిలో ఆయన దర్శనంతో పునీతులైన వారిలో స్వామి శివానంద, స్వామి చిదానంద (డివైన్ లైఫ్ సొసైటీ) స్వామి ముక్తానంద (గణేశ్‌పురి), స్వామి రామదాస్ (కంచన్‌ఘఢ్) కూడా వున్నారు.

జాతిని జాగృతపరిచే కార్యక్రమంలో తలమునకలవుతున్న హేమాహేమీలను, మానవాళి పరిమితులను అధిగమించిన వున్నత స్థాయికి చేర్చడంలో భగవాన్ తమ జీవిత విధానం, బోధలతో వుత్తేజిత పరిచారు. భారతమాతను విదేశీయుల శృంఖలాల నుండి విముక్తి చేసే కార్యక్రమంలో నిమగ్నులైన నాయకులలో ధైర్యం,

సహనాలను నూరిపోయడంలో ఆధ్యాత్మిక శక్తి దోహద పడింది. ఫలితంగా అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం లభించింది.

నా ఉపన్యాసంలో రెండవ భాగం:

భారతదేశపు ఆధ్యాత్మిక సంపద, సాంప్రదాయాల కొన సాగింపులో భగవాన్ యొక్క పాత్ర:

మన ప్రాచీన ఆధ్యాత్మిక ఆత్మవిచార మార్గమును అధునాతన పరిస్థితులకు అనుగుణంగా మార్చి తిరిగి అమలులో పెట్టడానికి వీలుగా చేయడం, భారతీయ ఆధ్యాత్మిక సంపద, సాంప్రదాయాల కొనసాగింపుకై భగవాన్ ప్రముఖ పాత్ర వహించారు. పురాతన కాలంలో ఈ మార్గము, ప్రపంచానికి సంబంధం లేకుండ ఎక్కడో ఏకాంతంలో నిరంతర ధ్యానంలో మునగ గలిగే ఏ కొద్దిమంది ధైర్యశాలురకో పరిమితమై వుండేది. అందుకే ఆ ప్రక్రియను, కాలం గడిచే కొద్ది పాటించడం అంతకంతకు తగ్గుతూ వచ్చింది. నవీన ప్రపంచంలోని పరిస్థితులకు అనుకూలంగా దానిని సర్దుబాటు చేసి, కర్మయోగంతో జోడించి అమలు జరిపేందుకు భగవాన్ తోడ్పడ్డారు. ఇందులో ఏ ప్రత్యేకమైన ఆచారాల అవసరం లేనందున యిప్పటి పరిస్థితులకు అనువైనది.

ఆయన, ఏ ఒక్క మతానికే పరిమితం కాని విధంగా అన్ని ప్రాంతాలలో అందరికీ అనుకూలమైన విధంగా జ్ఞానయోగాన్ని పునరుద్ధరించారు.

శ్రీరామకృష్ణ పరమహంస డార్విన్ వంటి వారనుకుంటే, శ్రీరమణ మహర్షి ఐన్‌స్టీన్ వంటి వారు. మొత్తం మానవ

ఆధ్యాత్మికతను క్రోడీకరించి తిరిగి రూపొందించినది శ్రీరామకృష్ణులైతే, రమణ మహర్షి, సరిక్రొత్తగా సత్యమనే దాన్ని సరిదిద్ది, ఒక శాస్త్రీయ పరిశోధకుని వలె, ఆత్మ విచారణను ఎవరైన జరిపి, దానిని యథార్థమని శాస్త్రీయంగా ఋజువు చేసుకొనగలిగే స్థాయిని చూపారు. శ్రీరామకృష్ణ బెంగాలీ సంస్కృతిని, దాని భావోద్రేక లక్షణాలతో సహా ప్రదర్శించగల శక్తిని కలవారు, అలాగే గాంధీజీ గుజరాతీ సంస్కృతిని, దాని భావోద్రేక లక్షణాలతో సహా ప్రదర్శించ గల శక్తిని కలవారు. అలాగే గుజరాతీ సంస్కృతి విషయంలో, వున్నది యథాతథంగా గాంధీజీ చూపగలిగిన శక్తిమంతులు. అలాగే శ్రీరమణులు తమిళ సంస్కృతి విషయంలో దాని వున్నత మేధోపరమైన అంశాలతో సహా ప్రపంచానికి ఆచరణీయ విధంగా తెలియ జెప్పగలిగిన గొప్పవారు.

ఈ ప్రపంచం పట్ల జీవన్ముక్తుని ప్రవర్తన ఒక ప్రత్యేకమైన అనుభవాన్ని ఏర్పరుస్తుంది. ఇంకను 'మాయ' ప్రభావంలో వున్న వారికి వ్యావహారిక, పారమార్థిక అంశాలను జతపరిచే ఒక సంధిగా పనిచేస్తుంది. ఎఱుకకు సంబంధించినంత వరకు ఏకత్వ సాధన ఆచరణ సాధ్యమని తెలుపుతుంది. కలగనేవాడిలో కల వుంది గాని కలలో కలగనేవాడు లేడని వ్యక్తం చేస్తుంది. తాను మమేకం కాకుండ, తాను కర్తయని భావించకుండ ఎంతటి కార్యాన్ని గాని చక్కగా నిర్వర్తించగలడు. వారిలోని అంతఃశక్తి కార్యాలను నడిపింప జేస్తుంది. మన మధ్యలోనే శుద్ధ ఎఱుక రూపంలోనే వుంటూ, అందరిలో ఒకరుగా జీవన్ముక్తుడు నడుచుకుంటాడు.

కపాలి శాస్త్రి మాటల్లో: ''ఈ ప్రపంచంలోని జ్ఞానుల చరిత్రలో మహర్షి ఒక విశిష్ఠ స్థానాన్ని ఆక్రమించారు. ఆత్మసాక్షాత్కారాన్ని సాధించిన తరువాత 54 ఏళ్ళు జీవించిన మహర్షి, ఒకే చోటి నుండి కదలక, ఎందరినో ప్రభావితం చేస్తూ, ఎల్లప్పుడూ అందరికీ అందు బాటులో వుండడమన్నది యిప్పటి వరకూ ఎక్కడా జరగనిది.''

కంచి పరమాచార్య: తన సిద్ధాంతాల ఆధారంగా ఏ మతమూ విస్తరించలేదు. ప్రజలు సిద్ధాంతాలను పట్టించుకోరు. జీవన విధానం లోను, ప్రవర్తనలోను మొక్కవోని మంచితనంతో, కరుణ, ప్రశాంతతలను ఎప్పుడూ వెదజల్లే ఒక వ్యక్తిని తాము దర్శించిన క్షణంలో ప్రజల్లో గాఢమైన నమ్మకం ఏర్పడుతుంది. అలాంటి జ్ఞాని నిర్వచించిన సిద్ధాంతాలు తప్పక లోపరహితం అయి వుంటాయని నిర్ధారించుకుంటారు. నడవడిక సరిగాలేని వారు ఏదైనా సిద్ధాంతం ప్రతిపాదించినప్పుడు అది ఎంత నిజం, పటిష్ఠమని అనిపించి నప్పటికీ సాధారణ ప్రజలకు నచ్చదు. భగవాన్ తాము స్వయంగా జీవిస్తూ, ఆచరించి చూపిన సిద్ధాంతాలనే ప్రబోధించారు''.

ఒక చిరకాల భక్తుడు, అలహాబాదు విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్ర ఆచార్యుడుగా పనిచేసిన డా॥ హాఫీజ్ సయ్యద్, మహర్షి యొక్క నిత్య జీవిత ఆచరణాసరళిలో ప్రతిబింబించిన తత్త్వము ఈనాడు మనం గమనిస్తున్న పలు సామాజిక, రాజకీయ, మతపర, ఆర్థిక సమస్యల నివారణకు ఒక సమర్థమైన నివృత్తి మార్గంగా పనిచేస్తుంది అన్నారు. ఈ యోగి ఒక పట్టు వదలని బోధకుడు, మత ప్రచారకుడు లేదా సంస్కర్త కారు. యథార్థంగా భగవాన్

సత్యాన్వేషణ క్రమంలో ఎరుకలో లేని విషయాలను, తార్కికంగా బలమైన ఆధారాలతో తమ అసాధారణ మేధోసంపత్తి సహాయంతో శాస్త్రీయ పద్ధతులతో ప్రకటించిన ఆధ్యాత్మిక శాస్త్రవేత్త.

ఇప్పటి శాస్త్రజ్ఞుడు కేవలం తన కోసమే కాకుండ యావత్తు మానవాళి యొక్క కల్యాణానికి వుపయోగపడే విధంగా ఒక నూతన సత్యాన్ని కనుగొంటాడు. ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతి తరతరాలూ అలాగే వెలుగుతూ వుండాలనే ఆకాంక్షతో మహర్షి తమ పరిశోధనలను అంకితం చేశారు.

ఆత్మ విచారణ అంటే ఏమిటో క్లుప్తంగా వివరిస్తాను. మనం సత్‌చిత్ ఆనంద - పరిశుద్ధ చైతన్యం. కాని మనం శరీరం, మనసుతో మమేకం కావడం వల్ల తప్పు చేస్తున్నామన్నది వేదాంతం యొక్క ప్రధాన బోధ. ఈ తప్పుకు ముఖ్యకారణం మన అహంకారం. అహం అన్నది ఒక ఆలోచనల సమూహం (మూట). దానికి మూలం ''నేను'' అన్న ఆలోచన అని భగవాన్ బోధించారు. గాఢ నిద్రలో అహం మాయమైనప్పుడు, ఆలోచనారహిత స్థితిలో వున్నప్పుడు మనకు ఆనందం, శాంతి లభిస్తాయి. ఆ ప్రశాంత స్థితిలో ఏ పెద్ద అనర్థం, బాధ మనకు తెలియరాదు. నిద్రలేచిన క్షణంలో మొదట మొలిచే ఆలోచన ''నేను'' అన్న ఆలోచన. అప్పటి నుండి మనల్ని మనం నేను ఫలానా ''డా॥ రమణన్'' అని మొదలుకొని, ఆలోచనా పరంపర మొదలౌతుంది. ఇక నేను ఢిల్లీలో వున్నాను, ఈ సాయంత్రం ఒక ఉపన్యాసం యివ్వాలి, అంటూ ఆలోచనలు వరుసగా వస్తాయి. ఈ ఆలోచనలన్నిటికీ కారణం ''నేను'' అన్న ఆలోచన. భగవాన్ ఈ మౌలిక కారణాన్ని పరిశీలించి, దానిని మిగతా

అన్ని ఆలోచనలతో జతపడకుండ తొలగించాలని బోధిస్తారు. అలాగ జరిపిన తరువాత మౌలికంగా ''నేను'' ఆలోచన యొక్క కేంద్రం, అంటే నిర్మలమైన ఆనందం, ప్రశాంతతకు నిలయమైన హృదయాన్ని గుర్తించాలి.

''రమణగీత''లోని ఐదవ అధ్యాయంలో హృదయ విద్య - హృదయ శాస్త్రజ్ఞానం - లో తెలిపినట్లు మనం చర్చిస్తున్నది ఎడమ వైపు వున్న భౌతికమైన గుండె కాదని, కుడివైపు వున్నట్లు భావించే ''ఆత్మ'' అని భగవాన్ తెలిపారు. ఆ కేంద్రం నుండి ''నేను'' ఆలోచన, మిగతా అన్ని ఆలోచనలకు మూలం.

''ఈ మొత్తం విశ్వం శరీరంలో వుంది, మొత్తం శరీరం హృదయంలో వుంది, అంటే విశ్వమంతా హృదయంలో వుంది. సూర్యుడు చంద్రునికి వెలుగునిచ్చినట్లే, హృదయం మనసును ఉత్తేజ పరుస్తుంది. హృదయాన్ని విస్మరించిన మర్త్యుడు మనసును మాత్రమే చూడగలగడం, రాత్రిళ్ళు సూర్యుడు లేనప్పుడు చంద్రుని వెలుగును చూడడానికి ప్రయత్నించడంతో సమానం. తన ఆత్మయే అసలైన తేజస్సు నిస్తుందన్న సత్యాన్ని గ్రహించక, మానసికంగా అగుపడే వస్తువులు తన కంటే భిన్నమైనవని అనుకుంటూ అజ్ఞాని మోసపోతుంటాడు. ఎల్లప్పుడూ హృదయంలో వుపవిష్టుడైన జ్ఞాని, ఆత్మను సూర్యుని తేజస్సులో లీనమైన చంద్రుని వెలుగు లాగ, హృదయంలో విలీనమైన మనసు యొక్క వెలుగుగా గ్రహిస్తాడు. దృశ్యం, ద్రష్ట వేరు అన్న భావనను మనసు కల్పిస్తుంది. హృదయంలో వుపవిష్టుడైన వ్యక్తికి దృశ్యం, ద్రష్ట ఒకటేనన్న స్పృహ వుంటుంది.

భగవాన్ కావ్యకంఠ గణపతి మునికి విశదీకరించినట్లు ఎక్కడ "నేను" అన్నది ఉదయిస్తే అందులోకి మనసు విలీనమౌతుంది. తపస్సంటే అదే. మంత్రాన్ని జపిస్తున్న వ్యక్తి, మంత్రం యొక్క స్వరం యొక్క మూలాన్ని గమనిస్తే అందులోకి మనసు లీనమౌతుంది. తపస్సంటే అదే.

ఒక ఆచరణీయమైన ఉదాహరణ: నేను దేని గురించిగాని, ఎవరి గురించి గాని కలత చెందుతున్నాననుకోండి. ఆ కలతలో మరింత కూరుకొని పోకుండా వుండటానికి మనం చేయవలసినది యిది: "కలత చెందుతున్నవారు ఎవరు? సమాధానం: "నేను". అప్పుడు "నేను ఎవరు" అని ప్రశ్నించుకోవాలి. నేను ఈ శరీరం కాదు, ఈ మనసు కాదు అన్నది గుర్తు చేసుకోవాలి. అలాగ మనల్ని మనం శుద్ధచైతన్యం- "అసలు" "నేను" ఆలోచనలోకి, అక్కడి నుండి హృదయానికి మళ్ళించి, తద్వారా కలతల ప్రభావం నుండి బయట పడవచ్చు. ఆత్మ విచారణను తరచు చేస్తూ వుంటే, మనం ఆలోచనలపై అదుపు సాధించి జీవితంలో సంభవించే హెచ్చు తగ్గులను ప్రశాంతతతో నియంత్రిస్తాము. శరీరం మాట్లాడడం, చదవడం, మరేదైనా ప్రక్రియలో గాని నిమగ్నమైనప్పుడు కూడ శుద్ధ చైతన్యం "అసలు నేను" నుండి దృష్టిని మరల్చరాదు.

ఎట్టి పరిస్థితులలోనైనా, ఎక్కడైనా, ఏ సందర్భంలోనైనా ఏ అడ్డంకి లేకుండ జరుపుకొనగలడం ఈ పద్ధతి యొక్క సౌలభ్యం. ఏ రకమైన బాహ్య ఆచారాలు అవసరం లేదు. ప్రక్కనున్న వారికి కూడా మనం ఆత్మ విచారణలో వున్నామన్నది తెలియదు. వాళ్ళకు మన సామర్థ్యమూ, ప్రశాంతత మాత్రం తెలియవస్తుంది. దానిని

మరే విధమైన యితర కార్యక్రమాల మధ్యలో కూడ ఆచరించుకోవచ్చు. అందుకే భగవాన్ ఎవరైనా లౌకిక ప్రపంచం నుండి వేరుపడాలనుకోవడాన్ని ప్రోత్సహించలేదు. దానివల్ల ఒరిగేదేమి లేదు. ''నేను గృహస్థుడిని'' అన్న ఆలోచనకు బదులు ''నేను సన్యాసిని'' అని ఆలోచించడం తప్ప మరే లాభమూ లేదు. నిజంగా చేయవలసినది ''నేను కర్తను'' అన్న ఆలోచనను సమూలంగా తీసివేసి ''నేను (వున్నాను)'' అని జ్ఞాపకం వుంచుకుంటే చాలు అని భగవాన్ అన్నారు. దీని కోసం చేయవలసిన ఆత్మ విచారణ ఊళ్ళోగాని, అరణ్యంలోగాని కానివ్వవచ్చు. ఇలాగ కర్తృత్వ భావనను త్యజించడమే అసలైన త్యాగమని గుర్తించి అలవరచు కోవడం సాధకులకు అత్యంత మనశ్శాంతిని యిచ్చి భారతదేశం యొక్క అతి వున్నతమైన తత్త్వాన్ని సర్వులకు అందుబాటులోకి తెస్తుంది. వేదాంతాన్ని గురించి యుగాలుగా ఎందరో విశదంగా తెలిపారు గాని, భగవాన్ ఆ వేదాంతసారాన్ని చాలా సమర్థవంతంగా విడమర్చి తెలియ జేశారు. అలాగ భగవాన్ వేదాంతానికి క్రొత్త ఊపిరి పోసి, యీ మార్గం ఏదో పైపైన మాట్లాడుకునేది కాకుండ, జీవితం సాఫీగా నడవడానికి అత్యంత ఆచరణీయ మార్గమని రూఢి పరచారు.

భగవాన్ ఎప్పుడూ ఎవరినీ తమ విధులను విస్మరించమని గాని, లౌకిక కర్మలను ఆచరించవద్దని గాని ప్రోత్సహించలేదు. భక్తులకు ''నేను కర్తను'' అన్న ధోరణిని విడనాడమని, కర్మఫలాన్ని ఆశించవద్దని చెబుతూ వచ్చారు. ''నీ వునికి యొక్క సత్యాన్ని ఎల్లప్పుడూ హృదయంలో వుంచుకుని ఈ ప్రపంచంలో నీ పాత్రను

చక్కని నాయకుడి వలె నిర్వర్తించు. లోలోపల ఏ అనుబంధము లేకుండ, వుత్సాహాన్ని, ఆనందాన్ని అనుభవిస్తూ, వివిధ పరిస్థితుల్లో నీవు ఆచరించాల్సిన కార్యక్రమాలను నీ బాధ్యతల ప్రకారం పూర్తి చెయ్యి'' (యోగ వాశిష్ఠ).

ఆత్మ సాక్షాత్కారానికి, అలాగే ముముక్షత్వం కోసం జరిపే అన్వేషణ, ఈ ప్రపంచంలో అతి క్లిష్టమైన విధులను నిర్వర్తించడం కోసం చేసే కార్యక్రమాలు, ఒక దానికొకటి తోడుగా నడుస్తుండాలి. ధర్మాచరణలో సాధకునికి, జ్ఞానికి ఏ తేడాలు వుండవు. భగవాన్ దీనిని తమ జీవితంలో ఆచరించి చూపించారు.

తాము తిరువణ్ణామలైలో జీవించిన 54 ఏళ్ళలో, పూర్ణజ్ఞాని, ప్రజల మధ్యలో సాధారణ జీవితాన్ని గడుపుతూ, తాను యథార్థంగా బ్రహ్మన్ (ఆత్మ) అన్న సత్యాన్ని విస్మరించకుండ వుండవచ్చునని ఋజువు చేశారు. పురాతన ఋషుల వలె భగవాన్ జీవించారు. పురాణాలలో మనం అలాంటి జ్ఞానులను గురించి చదివాము. ప్రపంచం నలు మూలల నుండి తీవ్ర సాధకులు, స్త్రీ పురుషులు, పేదవారు, ధనవంతులు, పండితులు, పామరులు యింకా జంతువులు, పక్షులు కూడ ఆయనను ఆశ్రయించారు.

ఇటీవల నేను కలిసిన ఒక ఆచార్యుడు వసుధైవ కుటుంబకమ్ - అన్న దానిని ''రమణ మహర్షి'' అని రెండు పదాలలో విశద పరచవచ్చు అన్నారు. పారంపర్యంగా భూమిని, నీటిని పవిత్రంగా భావించే మన నమ్మకానికి అనుగుణంగా అరుణాచల పవిత్ర పర్వతాన్ని మహర్షి ఆరాధించారు. ఈ నాటికీ భగవాన్ సన్నిధిని, వారు శరీరంతో వున్నప్పటికంటే కూడా మరింత గాఢంగా

అనుభవిస్తున్నాము. సిరియా, టర్కీ, యిజ్రయేల్, చైనా, భారత్ మరియు పలు ప్రాంతాల నుండి వచ్చిన అన్ని వర్గ, వర్ణాల సాధకులను కలుస్తుంటాను. మన ఆశ్రమంలో, నెమళ్ళు, ఆవులు, కోతులు, కుక్కలు, అందరితో కలిసి జీవిస్తున్నాయి. వివిధ వృక్ష సముదాయంతో కూడిన ఈ ఆశ్రమం, రామాయణంలోని పంచవటిని పోలి వుంటుందని వచ్చిన సాధకులు చెబుతుంటారు. ఇది భగవాన్ యొక్క ఆధ్యాత్మిక సంపద. పాక్షికంగానైనా సరే భగవాన్ బోధల ప్రకారం నడుచుకుంటే, ఎంతో శాంతి, నెమ్మది కలుగుతుంది. భగవాన్ తమ బోధల రూపంలో యిక్కడ శాశ్వతంగా సాధకులు అందరికీ ఆంతరంగిక గురువుగా విలసిల్లుతున్నారు.

ఇక ముగింపు వాక్యాలు:

జాతిని జాగృతం చేయడంలోను, భారతీయ ఆధ్యాత్మిక సంపద, పారంపర్యతలను కొనసాగించడంలోనూ శ్రీరమణ మహర్షి చెప్పుకోదగిన పాత్రను పోషించారు. ఆ విషయంపై కొన్ని ప్రధాన అంశాలు:

(1) ఆధ్యాత్మికత - జాగృతి: శ్రీ రమణమహర్షి సన్నిధి, బోధలు ఎందరిలోనో ఆధ్యాత్మికపరమైన జాగృతిని రేకెత్తించాయి. ఆత్మ విచారణ అంటే మనిషి యొక్క సత్యమైన స్వభావం యొక్క ప్రత్యక్షానుభవ సాధ్యతలను నొక్కి చెప్పడం. ఇది వివిధ రంగాలకు చెందిన సాధకులలో ముద్ర వేసింది. మహర్షి తమ బోధల ద్వారా ఎందరో వ్యక్తులలో ఆధ్యాత్మిక స్వేచ్ఛను సాధించడానికి కావలసిన ప్రోత్సాహాన్ని పెంపొందించారు.

(2) అద్వైత వేదాంతం: తమ ప్రత్యక్షానుభవం ఫలితంగా, రమణ మహర్షి బోధలు, సత్యం యొక్క యథార్థ స్వభావాన్ని ప్రబోధించే అద్వైత తత్త్వంలో వేళ్ళూని వున్నాయి. ఈ ప్రాచీన ఆధ్యాత్మిక పరమైన సంప్రదాయాన్ని పునరుద్ధరించడంలో ఆయన సహాయం ఎంతో గొప్పది. ప్రపంచవ్యాప్తంగా వున్న పండితులు, సాధకులు, ఆధ్యాత్మిక బోధకులపై భగవాన్ బోధలు యిప్పటికీ ప్రభావాన్ని చూపుతూనే వున్నాయి.

(3) సార్వజనిక సందేశం: రమణ మహర్షి బోధలు మతపరమైన, సాంస్కృతిక పరమైన హద్దులకు అతీతమైనవి. అన్ని మతాల ఏకత్వాన్ని, ఆత్మ సాక్షాత్కారం యొక్క విశ్వవ్యాప్త ఆవశ్యకతను మహర్షి ప్రోత్సహించారు. ప్రేమ, కరుణ, వివిధ రంగాల ప్రజల మధ్య ఏకత్వ భావన ప్రాముఖ్యాన్ని తెలుపుతూ, మనమందరమూ "ఆత్మన్" తప్ప వేరేమీ కాదని బోధించారు.

(4) శ్రీరమణ మహర్షి ఆశ్రమం: శ్రీ రమణ మహర్షి చుట్టూ పెంపొందిన ఆశ్రమం శ్రీరమణాశ్రమం అని పిలువబడుతూ విశ్వవ్యాప్తంగా వున్న సాధకులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఆయన నిరంతర సన్నిధి ధ్యానానికి, ఆధ్యాత్మిక సాధనకూ అంతకంతకు ఈ ఆశ్రమం మరింత ప్రాముఖ్యాన్ని సంపాదించుకుంటూనే వుంది.

(5) రచనలు: శ్రీరమణ మహర్షి బోధలు రాబోయే తరాల కోసం రచనల రూపంలో సంగ్రహింపబడ్డాయి. భారతీయ, ఇతర ప్రపంచ భాషలకు చెందిన ప్రపంచంలోని పలు ప్రాంతాలలోని

సాధకులకు అందుబాటులో వుండడానికై వాటి అనువాదాలు లిఖింప జేయబడ్డాయి.

(6) ఆధ్యాత్మిక బోధకులపై ప్రభావం: రమణ మహర్షి బోధలు ఎందరో ఆధ్యాత్మిక బోధకులపై అత్యంత ప్రభావాన్ని చూపాయి. భారతదేశంతో బాటు యితర దేశాలలోని సాధకులను ఆయన బోధలు వుత్తేజపరచి మార్గదర్శకాలుగా పనిచేస్తున్నాయి.

గాంధీజీని గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ‘‘రాబోయే తరాలకు అతని వంటి వ్యక్తి ఈ భూమిపై శరీర రూపమెత్తి నడయాడాడని నమ్మడం ఎంతో కష్టం’’ అన్నారు. శ్రీమద్భగవద్గీత, యితర ఆధ్యాత్మిక గ్రంథాలలో మహాత్ములైన ఋషుల గురించి చదివాము. కాని యిటీవలి 20వ శతాబ్దిలోనే అది జరిగింది.

ప్రస్తుతం యిది కృత్రిమ మేధస్సు యుగం. ప్రతి ఒక్కటి కృత్రిమ మేధస్సు చుట్టూ పరిభ్రమిస్తోంది. అందుకే ఏ.ఐ. ‘భాష’ లో యీ ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను. ఈనాటి అంశం ‘‘జాతీయ జాగృతి, భారతీయ ఆధ్యాత్మిక సంపద, పారంపర్యతలు’’. ‘‘అరుణాచలము (ఏ) భారతదేశం (ఐ) (ఏఐ) అంటే భగవాన్ అరుణాలం విచ్చేసి ఇచ్చిన అపూర్వమైన ఆధ్యాత్మిక సందేశాలు అని అర్థం చేసుకోవచ్చు. ఆత్మజ్ఞానం, శుద్ధ చైతన్యం (‘ఐ’ ‘నేను’) రంగంలో భగవాన్ పాత్రను శ్లాఘిసస్తూ మన పరిమితమైన ‘అహం’లను నశింప జేసుకోవాలని నా ప్రార్థన.

*****

# Acceptance will Lead to Contentment

(Talk 38)

Dr K Subrahmanian

Parents love their children, and this, children, by and large, take for granted. It is one of the strange things of human nature that we realise this only after we ourselves become parents. Children never know the concern that we have for them day after day and night after night. We may get angry with them, occasionally scold them and even abuse them; but when it is over, we feel bad and wish them well, even if our affection is not reciprocated. This is something that every parent does consciously, for our children's attitude towards us may sometimes make us wonder why we should love them. This feeling is usually momentary or it may last only for a day or two because in the secret cupboard of our heart, there is only love and affection, and itis always flowing. However old our kids become, and wherever they may be, we think only of their welfare. From the point of view of reason, it may seem absurd that we worry about an adult who is 40 or 50 years old, but that is what being a parent means; it is human nature – it is *niyati*. Whether they remember us or not, whether they treat us with respect or not, we constantly think of them, and worry about them. We don't consider this to be extraordinary because this is what most parents do!

We very often wonder whether it is possible for a *guru* to think of his disciples in a similar manner – especially

one who has many disciples.He probably does because even a parent who has ten children thinks about all them. What is interesting is that during his waking hours, he tends to think more about those who are not well off. It is difficult for the children to completely understand the concern the parent has for them. When a small child is playing, and the mother is cooking, a part of her mind continues to be with the child. The moment she hears the child cry, she runs towards it, without worrying about the utensils that are on the stove. If this is the compassion we have at our own level, how much more it will be at the level of the *guru*!

Bhagavan says that we cannot understand the greatness or the grace of a *guru* because it is beyond thought and word. Although we may experience his grace and compassion from time to time, we will always continue to have doubts. The *guru* looks after us in ways that we cannot imagine or understand. Bhagavan says that we must realise that the *guru* has come to us by the grace of the Lord; and through our constant interaction with him, we will realise that our *guru* is God himself. The moment we consider somebody our *guru*, we must surrender to him, without any question, and he in turn, will give us the strength to face life and its problems, cheerfully. Nobody can be free from everyday problems, but the *guru* will give us an attitude which will allow us to confront them without any mental worry. But since we are feeble-minded, we are occasionally plagued by doubts about our *guru* and God. Even Swami Vivekananda had doubts.

